క్లుప్తంగా

వీధిలైట్ల ఏర్పాటు


యల్లమ్మ స్వామి వీధిలో ఎల్ఈడీ లైట్ వేస్తున్న దృశ్యం

నల్లచెరువు: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ వీధి, యల్లమ్మ స్వామి వీధుల్లో సర్పంచ్ పంచరత్నమ్మ ఆధ్వర్యంలో మంగళవారం ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మేజర్ పంచాయితీ పరిధిలో మరమ్మతులకు గురైన వీధిలైట్లను గుర్తించి వాటి స్థానంలో నూతన ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశామన్నారు. పంచాయితీ కార్యదర్శి నరేష్, లైన్‌మెన్ జనార్దన్ పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలి


ఆర్డీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని అంబేడ్కర్ సేవా సమితి నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ వీవీఎస్ శర్మకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదల కోసం ఆర్డీటీ సంస్థ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఎఫ్ఆర్‌సీఏ రెన్యూవల్ నిలిపివేతతో పేదలకు వైద్యంతోపాటు అనేక సేవలు అందడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎఫ్ఆర్‌సీఏ లైసెన్స్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నాయకులు హరిప్రసాద్, వేణుగోపాల్, దిల్షాద్, మునికుమార్, నసీమా, నాగరాజు పాల్గొన్నారు.

నూతన ఎంపీడీఓకు సన్మానం


ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామకృష్ణను సన్మానిస్తున్న ఎంపీపీ రమణారెడ్డి

నల్లచెరువు: మండల పరిషత్ కార్యాలయంలో ఇంచార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణను ఎంపీపీ రమణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. గతంలో మండల ఎంపీడీఓగా పని చేసిన రఘునాథగుప్త డ్వామా ఏపీగా పదోన్నతి పొంది నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో ఇక్కడ ఏఓగా పనిచేసిన రామకృష్ణ ఇంచార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు.

మోడ్రన్ పోలీసింగ్‌పై అవగాహన


నూతన హెల్మెట్లతో డీఎస్పీ, సీఐ, పోలీసు సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: మోడ్రన్ పోలీసులు ఎలా ఉండాలి? అన్న విషయంపై ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ సిబ్బందికి అవగాహన కల్పించారు. చెన్నేకొత్తపల్లి పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన హెల్మెట్లను సిబ్బందికి పంపిణీ చేశారు. అల్లర్లు జరిగే సమయంలో హెల్మెట్లు ఎంతో రక్షణగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో రామగిరి సీఐ శ్రీధర్, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి ఎస్ఐ సత్యనారాయణ, రిజ్వాన్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు లేని పంచాయతీలుగా తీర్చిదిద్దాలి


మాట్లాడుతున్న ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి

తాడిమర్రి: మండలంలోని గ్రామ పంచాయతీలను సమస్యలు లేనివిగా తీర్చిదిద్దాలని ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటరంగారావు అధ్యక్షతన ప్రజా ప్రతినిధులు, గ్రామ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీ అభివృద్ధి సూచిక పీఏఐ–వీ2.0పై అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రణాళికబద్ధంగా ముందుకెళ్లాలన్నారు. పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు, ఆరోగ్యం, బాలల హితం, నీటి సమృద్ధి, పచ్చదనం, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలు ఉన్న పంచాయతీలుగా అభివృద్ధి పరచడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీఓ కృష్ణయ్య, ఏఓ నాగేంద్ర పాల్గొన్నారు.

పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ

ఎన్పీకుంట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ పురోగతి సూచికపై ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఎంపీడీఓ పార్థసారథి పాల్గొన్నారు.


ధర్మవరం అర్బన్: గౌరీదేవిగా లక్ష్మీనగర్ రాజ్యలక్ష్మి చౌడేశ్వరిదేవి


ధర్మవరం అర్బన్: గాయత్రిదేవిగా సాలేవీధి పెద్దమ్మతల్లి


తాడిమర్రి మండలం దాడితోటలో బాలత్రిపుర సుందరిదేవిగా పెద్దమ్మ తల్లి


కదిరి అర్బన్: రాజరాజేశ్వరీదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరీ మాత


పుట్టపర్తి టౌన్: బాలత్రిపురసుందరిగా వాసవీమాత


ఖాద్రీ ఆలయంలో కూర్మావతార అలంకారం


తలుపులో పసుపు కుంకుమ అలంకారంలో వాసవీమాత

దుర్గామాత నమోస్తుతే

ధర్మవరం అర్బన్: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు మంగళవారం అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్ల మూల విరాట్లను వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


ధర్మవరం అర్బన్: బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో లక్ష్మీచెన్నకేశవస్వామి


రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిస్తున్న మరకత మహాలక్ష్మి


అమడగూరులో గాయత్రిదేవి రూపంలో చౌడేశ్వరి అమ్మవారు


బత్తలపల్లి కూడలిలో గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు


కనగానపల్లి: గాయత్రీదేవిగా సల్లాపురమ్మ


చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురంలో అలంకరణలో చౌడేశ్వరి


ముదిగుబ్బలో గాయత్రిదేవి అలంకరణలో వాసవీమాత

మండల పరిషత్ నిధులు కేటాయించాలి

నల్లమాడ: గ్రామాల్లో అభివృద్ధికి గాను మండల పరిషత్ నిధులు కేటాయించాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ దుంగావత్ సునీతాబాయికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు సక్రమంగా రాకపోవడంతో గ్రామాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించలేక, ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేకపోతున్నామన్నారు. కావున గ్రామ పంచాయితీలకు రావాల్సిన మండల పరిషత్ నిధులు విడుదల చేయాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కోరారు.


ఎంపీపీ దుంగావత్ సునీతాబాయికి వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్‌లు

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలి

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించి జిల్లాలో సంస్థ సేవలు యథావిధిగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు. పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్‌డీటీ సేవలు నిలిపివేయడం వల్ల పేద, బడుగు బలహీన వర్గాలకు ఎంతో నష్టం జరుగుతుందన్నారు. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు రజనీకాంత్‌రెడ్డి తరపున వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు కుళ్లాయప్ప, లింగమూర్తి, ప్రసాద్, బొజ్జేనాయక్, వైఎస్సార్ సీపీ మాజీ సర్పంచ్ ఎస్. రాంమోహన్‌రెడ్డి, టీడీపీ సర్పంచ్‌లు భారతి, ప్రభాకర్‌రెడ్డి తీర్మాణ పత్రాన్ని ఈఓఆర్డీ అమర్నాథరెడ్డికి అందజేశారు. పలు సమస్యలపై సభ్యులు చర్చించారు. జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించండి

పుట్టపర్తి టౌన్: రైతాంగ సమస్యలు పరిష్కరించాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను కోరారు. ఈమేరకు మంగళవారం ఆయన కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2 లక్షల హెక్టార్లలో వేరుశనగ, 65 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగయ్యాయన్నారు. టమాట, అరటి, మామిడి, దానిమ్మ తదతర పంటలను బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, తరలించే అనుకూలం ఉన్నప్పటికీ గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలన్నారు. ఆహార శుద్ధి పరిశ్రమలతో పాటు పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన కృషి విజ్ఞాన కేంద్రం నిర్మాణం పూర్తి చేయాలన్నారు. పట్టు రైతులకు సరైన ప్రోత్సాహకాలు అందిచాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ త్వరలో రైతులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.


కలెక్టర్‌కు రైతుల సమస్యలు వివరిస్తున్న జిల్లా అగ్రి బోర్డు మాజీ చైర్మన్ రమణారెడ్డి

రేషన్‌కార్డులు సక్రమంగా పంపిణీ చేయాలి

తాడిమర్రి: కార్డుదారులందరికీ రేషన్‌కార్డులు సక్రమంగాపంపిణీ చేయాలని తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి సచివాలయ సిబ్బంది, చౌకధాన్యపు డిపో డీలర్లను ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన సీఎస్‌డీటీ శారదతో కలిసి 10,600 స్మార్ట్ రేషన్‌కార్డులను సచివాలయ సిబ్బంది, డీలర్లకు అందజేశారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఎన్పీకుంట: మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ప్రత్యేక వైద్యాధికారి డాక్టర్ రమేష్‌నాయక్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం స్వస్థనారీ సశక్తి పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు, గర్భిణులకు, బాలింతలకు, కిశోరబాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార స్టాల్ ను ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. మండల వైద్యాధికారులు డాక్టర్ ఆనంద్‌వర్ధన్, డాక్టర్ బాలాజీనాయక్, సీహెచ్ఓ నాగలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ మహేశ్వరరెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరువు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ అలేఖ్య గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. సీహెచ్ఓ రామచంద్రారెడ్డి, సర్పంచ్ పంచరత్నమ్మ, సింగల్ విండో అధ్యక్షుడు వెంకటరమణ, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తనకల్లు: చీకటిమానిపల్లిలో మంగళవారం స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వైద్యాధికారి ధర్మరాజు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ, సూపర్‌వైజర్ సూర్యనారాయణరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ మోహన్‌రెడ్డి, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

తలుపుల: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారులు అఫ్తాప్, అశ్రీత ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యులు లక్ష్మీనరసయ్య, సూపర్‌వైజర్ రామ్మోహన్, శంకరమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నల్లమాడ: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బాబ్‌జాన్ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి డాక్టర్ మధుసూదన్ హాజరయ్యారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కేశవరెడ్డి, బుట్టి నాగభూషణనాయుడు, ఆస్పత్రి వైద్యులు డాక్టర్ అస్గరున్నీషా, డాక్టర్ నందిని, డాక్టర్ దీప్తి, డాక్టర్ మహేష్, డాక్టర్ అమృతవల్లి, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సాయికుమార్, దంత వైద్య నిపుణులు డాక్టర్ వివేక్, సీహెచ్ఓ రామాంజులు, హెల్త్ ఎడ్యుకేటర్ రామచంద్ర, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం లాభదాయకం

ఎన్పీకుంట: సేంద్రియ పద్ధతిలో పంటల సాగు లాభదాయకంగా ఉంటుందని ఏడీఓ సనావుల్లా తెలిపారు. వెలిచలమల, పడమరనడిమిపల్లిలో మంగళవారం ఏఓ లోకేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని, భూమికి సహజ బలాన్ని చేకూరుస్తుందన్నారు. రైతులు గ్రామాల్లో లభించే దిబ్బ ఎరువులు, గొర్రెలు, మేకల ఎరువులను అమ్ముకోకుండా పంటలకు వినియోగించాలని సూచించారు. మండల ఉద్యానశాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, ఏఈఓ శిరీషా, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

తనకల్లు: రైతులు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని ఏఓ భారతి సూచించారు. గంగసానిపల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. తద్వారా ఖర్చు తగ్గడంతో పాటు భూమిని సారవంతంగా ఉంచుకోవచ్చన్నారు. రైతులు యూరియా బదులు 500 ఎంఎల్ నానో యూరియా వాడుకోవాలని సూచించారు. సీఆర్‌పీ శంకర్‌రెడ్డి, వేదవతి, రైతులు పాల్గొన్నారు.


సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సనావుల్లా

సమన్వయంతో ఇసుక అక్రమ రవాణాకు చెక్

బత్తలపల్లి: ఇసుకను అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేయాలని ధర్మవరం ఆర్డీఓ మహేష్ పేర్కొన్నారు. మంగళవారం జ్వాలాపురం క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన ఇసుక చెక్‌పోస్ట్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక రవాణా విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఇసుక తరలించే వాహనాలను ఆపి సరైన ఇసుక బిల్లులు లేని వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. అన్ని లారీలు, వాహనాలు వే బిల్లులు, ఇసుక బిల్లులు కలిగి ఉండాలని, అక్రమ రవాణాలో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెక్‌పోస్ట్ సిబ్బంది రికార్డులను సక్రమంగా నిర్వహించి వే, ఇసుక బిల్లులను సమగ్రంగా పరిశీలించాలన్నారు. అక్రమ ఇసుక తవ్వకం, రవాణాతో ప్రభుత్వ ఆదాయం నష్టపోవడమే కాకుండా పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. తనిఖీల్లో తహసీల్దార్ స్వర్ణలత, రీసర్వే డీటీ షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.


జ్వాలాపురం చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేస్తున్న ఆర్డీఓ మహేష్

తప్పులులేని ఓటరు జాబితాను తయారీకి సహకారం

ధర్మవరం అర్బన్: తప్పులు లేని ఓటర్ల జాబితాను తయారు చేసేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకారం అందించాలని ఆర్డీఓ మహేష్ కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను వివరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండాలన్నారు. బోగస్ ఓట్లు లేకుండా ఖచ్చితమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయడానికి అందరూ సహకరించాలని సూచించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పుట్టపర్తి అర్బన్: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ జయంతి పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన గిర్భిణులకు ప్రశాంతిగ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీఓ పౌష్టికాహారం ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం మొక్కలు నాటి సంరక్షించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, మహిళా సంరక్షణ అధికారి తులసి, ఏఎన్ఎం అమృత, అంగన్‌వాడీ కార్యకర్తలు నర్మద, ఉమాదేవి, మంజుల, సులోచన తదితరులు పాల్గొన్నారు.


సీమంతం చేస్తున్న అధికారులు, సిబ్బంది

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

పుట్టపర్తి: బుక్కపట్నంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్ వైజర్ పుష్పలత మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని సిబ్బంది సూచించారు. ఈనెల 17 నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో మొక్కలు నాటారు.

‘మంగళకర’లో విండో షాపింగ్

పుట్టపర్తి అర్బన్: వ్యాపార కార్యకలాపాలపై అవగాహన కల్పించడానికి జగరాజుపల్లి మంగళకర ఎడ్యుకేషన్ ట్రస్ట్‌లో విండో షాపింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం కళాశాల ఆవరణలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ సురేష్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అన్ని రకాల విద్యలు నేర్చుకోవాలన్నారు. వ్యాపారంలో నష్టాలు కలగకుండా తీసుకునే చర్యలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, మేనేజింగ్ ట్రస్టీ సురేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆర్యా ప్రకాష్, ఏఓ జయచంద్రారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం


మృతుడి కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న రవికుమార్‌రెడ్డి

నల్లచెరువు: కె.పూలకుంట గ్రామంలోని ఉప సర్పంచ్ నీలమ్మ భర్త బయప్ప(50) గత వారం మృతి చెందాడు. మండల కన్వీనర్ మొండెం రవికుమార్‌రెడ్డి మంగళవారం గ్రామానికెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కదిరి సమన్వయ కర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ ఆదేశాలతో కన్వీనర్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజే శారు. వైస్ కన్వీనర్ రఫీ. ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ యూసుఫ్, పంచాయతీ రాజ్ నియోజకవర్గ కన్వీనర్ అక్బర్, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, మాజీ డైరెక్టర్ గోవిందురెడ్డి, మండల కార్యదర్శి సలీం, మైనార్టీ కన్వీనర్ ఫయాజ్, బషీర్, క్రిష్టా, తాజుద్దీన్, వాల్మీకి రవి, రామంజి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త భార్గవరెడ్డి(35) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మొండెం రవికుమార్‌రెడ్డి మంగళవారం భార్గవరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పోరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్ కల్యాణ్ మేళాను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి

పుట్టపర్తి టౌన్: పీఎం స్వానిధిలో భాగంగా లోక్ కల్యాణ్ మేళాను వీధి విక్రయదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, కమిషనర్ క్రాంతికుమార్ పేర్కొన్నారు. మంగళవారం పురపాలక సంఘం సమావేశ మందిరంలో వీధి విక్రయదారులు, చిరు వ్యాపారులతో మెప్మా ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో వీధివ్యాపారులు, చిరు వ్యాపారుల ఆర్థిక స్థితగతులను గుర్తించి పీఎం స్వానిధి ద్వారా రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు రుణాలు మంజూరు చేస్తారన్నారు. సకాలంలో చెల్లిస్తే 7 శాతం వడ్డీ రాయితీ కూడా ఇస్తామన్నారు. అనంతరం మేళాకు హాజరైన బ్యాంకర్లు బ్యాంక్ లావాదేవీలు, వడ్డీ రాయితీలు, డిజిటల్ లావాదేవీను వివరించారు.

వ్యక్తిపై కట్టెతో దాడి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీనగర్‌కు చెందిన ఉడుముల జయరాములును మంగళవారం ఇంటి ఎదురుగా ఉన్న పులిచెర్ల రామాంజనేయులు కట్టెతో దాడి చేసి గాయపరిచాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఇంటి ముందు ఎప్పుడు చూసినా రామాంజనేయులు వీధిలో అందరితో గొడవపడేవాడు. ఈక్రమంలో జయరాములుతో గొడవపడిన రామాంజనేయులు కట్టెతో అతని తలపై దాడి చేసి గాయపరిచాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన జయరాములును స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.

రైల్వే రక్షణ కోసమే ఆర్‌పీఎఫ్ ఆవిర్భావం



రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీఎఫ్ సీఐ నాగేశ్వరరావు

ధర్మవరం: రైల్వే రక్షణ కోసమే ఆర్‌పీఎఫ్ ఆవిర్భవించిందని ఆర్‌పీఎఫ్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రైల్వేశాఖపై ఎవరు దాడులు చేయరాదని చేసిన వారిపై కఠిన శిక్షలు ఉంటాయన్నారు. రైల్వేలో దొంగతనాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ప్రయాణికులు సైతం రైళ్లలో ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం గొట్లూరు గ్రామంలోని అనాథలకు, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఆర్‌పీఎఫ్ ఎస్ఐ కోటేశ్వరరావు, ఏఎస్ఐ పుల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.